ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 129 | పేజీలు: 6 | వెల: రూ.3/- | మంగళవారం 18 ఆగస్టు 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# బీజేపీ జాతీయ కార్యవర్గంలో భారీ మార్పులు

**పురంధేశ్వరికి జాతీయ ఉపాధ్యక్షురాలిగా నియామకం**

**తెలంగాణ నేతలకు పెద్దగా దక్కని ప్రాధాన్యత**

**ఏడు నెలల తర్వాత నితిన్ నబిన్ కొత్త టీమ్**



**న్యూఢిల్లీ, ఆగస్టు 18 (ప్రభాత ఉదయం)**

ఏడు నెలల తర్వాత భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తన కొత్త టీమ్‌ను ప్రకటించారు. పార్టీ భవిష్యత్ వ్యూహాలు, సంస్థాగత బలోపేతాన్ని దృష్టిలో పెట్టుకుని కీలక పదవుల్లో మార్పులు, చేర్పులు చేశారు. కొత్త కార్యవర్గంలో పలువురు సీనియర్ నేతలకు కీలక బాధ్యతలు అప్పగించగా.. మరికొందరికి పదవులు కొనసాగించారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులుగా మొత్తం 13 మందిని నియమించారు. ఇందులో రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజే, ఆంధ్రప్రదేశ్ నుంచి రామ్ మాధవ్, పురంధేశ్వరి వంటి కీలక నేతలకు చోటు దక్కింది. ఇదే సమయంలో తెలంగాణకు చెందిన డీకే అరుణను జాతీయ ఉపాధ్యక్ష పదవి నుంచి తప్పించారు. కొత్త జాతీయ కార్యవర్గంలో తెలంగాణకు ప్రాతినిధ్యం దక్కకపోవడం ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. జాతీయ ప్రధాన కార్యదర్శులుగా మొత్తం ఎనిమిది మందిని నియమించారు. మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి జాతీయ జనరల్ సెక్రటరీ బాధ్యతలు అప్పగించారు. పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో కీలకంగా వ్యవహరిస్తున్న బీఎల్ సంతోష్‌ను సంస్థాగత ప్రధాన కార్యదర్శి పదవిలో కొనసాగించారు. ఆయనకు పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో కీలక బాధ్యతలు యథావిధిగా కొనసాగనున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డికి కూడా కొత్త బృందంలో కీలక బాధ్యత లభించింది. ఆయనను జాయింట్ కో-ఆర్డినేటర్‌గా నియమించారు. అలాగే కేంద్ర కార్యాలయ ..మిగతా 2లో



## నిషేధిత జాబితా నుంచి భూములను తొలగిస్తాం

**టోల్‌ఫ్రీ నంబర్ 18005994788కు సంప్రదించాలి**

**ప్రజలను ఆఫీసులకు తిప్పే అధికారులపై చర్యలు తీసుకుంటాం**

**మీడియా సమావేశంలో పొంగులేటి వివరణ**

**హైదరాబాద్, ఆగస్టు 18 (ప్రభాత ఉదయం)**

ప్రైవేటు వ్యక్తుల ఆస్తికి ఆటంకం కలిగించాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రైవేటు భూమిని 22ఏలో పెట్టారంటూ మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల నుంచి 750 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. హైదరాబాద్‌లో మీడియాతో పొంగులేటి మాట్లాడుతూ అధికా రుల పొరపాటు వల్ల ఇలా జరిగిందన్నారు. 22ఏ భూములపై నాలుగు జిల్లాల్లోని అధికారులతో కలిసి చర్చించాం. గతంలో ఆ భూములు యూఎల్‌సీ జాబితాలో ఉన్నాయి. నిషేధిత జాబితాను అప్‌డేట్ చేయడంలో పొరపాటు జరిగిందన్నారు. అధికారుల తరఫున క్షమాపణలు కోరుతున్నానని మంత్రి అన్నారు. ప్రైవేటు ఆస్తుల్ని 22ఏ జాబితా నుంచి ..మిగతా 2లో

# సనత్ నగర్ టిమ్స్ ప్రారంభోత్సవం

## గత పాలకులు టిమ్స్‌లకు కొబ్బరికాయలు కొట్టి వదిలేశారు

**డెబ్బై శాతం నర్సులు రోగికి సేవలు అందిస్తే, 30 శాతం డాక్టర్లే క్రిటికల్ కేర్ చూస్తున్నారు**

**విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉంది**

**వచ్చే ఏడాదికల్లా ఉస్మానియా సహా అన్ని ఆస్పత్రులు ప్రారంభిస్తాం**

**సనత్ నగర్ టిమ్స్ ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్, ఆగస్టు 18 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ ప్రజా పాలనలో విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతో పాటు, రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పేదల ఆరోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గత 32 నెలల్లో ఆరోగ్యశ్రీ కోసం రూ.2,600 కోట్లు ఖర్చు చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటు లో ఉండేలా ప్రభుత్వ ఆస్పత్రుల సామర్థ్యాన్ని మరింత పెంచుతున్నామని తెలిపారు. తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ఆస్పత్రులు పేదలకు ఎంతో ఉపయోగపడతాయని సీఎం అన్నారు. గత పాలకులు టిమ్స్ నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి పనులను మర్చిపోయారని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో మూడు టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణాన్ని వేగంగా చేపట్టామని తెలిపారు. అదే విధంగా వరంగల్‌లోనూ ఆస్పత్రి నిర్మాణ పనులను వేగవంతం ..మిగతా 2లో

## డబ్బులు దండుకోవడానికే నిషేధిత జాబితా..

**ప్రజల్లో గందరగోళం రేపిన 22ఎ జాబితా**

**సిఎం రేవంత్ ఇల్లు జాబితాలో వచ్చాకనే చురుకు.. పాలనపై పట్టు లేదనడానికి ఇదే పెద్ద నిదర్శనం**

**మీడియా సమావేశంలో హరీష్ ఆగ్రహం**



**హైదరాబాద్, ఆగస్టు 18 (ప్రభాత ఉదయం)**

రాష్ట్రంలో 22ఎ సెక్షన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా భూములను నిషేధిత జాబితాలో పెట్టి ప్రజలను తీవ్ర గందరగోళా నికి, అయోమయానికి గురి చేస్తోందని.. హరీశ్ రావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 1999లోనే అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని రద్దు చేశారు. మన రాష్ట్రంలో 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆ చట్టాన్ని పూర్తిగా ఎత్తేశారు. కానీ ఆనాడు సీలింగ్ పరిధి నుంచి బయటపడి, క్లియర్ అయిన భూములను కూడా ఈ ప్రభుత్వం ఇపడు మళ్లీ తీసుకొచ్చి సీలింగ్ యాక్ట కింద 22ఎలో పెట్టడం ఏ రకమైన న్యాయం..ఈ ప్రభుత్వానికి కనీస అవగాహన, పాలనపై పట్టు ..మిగతా 2లో



## కళ్యాణ లక్ష్మి కొనసాగుతుంది

**గత ప్రభుత్వం పక్కాగా అమలు చేయలేదు**

**అందుకే కోర్టుల్లో కేసులు వచ్చాయి.. దీనిపై డివిజన్ బెంచ్‌కు అప్పీల్ చేస్తున్నాం**

**మీడియా సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి**

**హైదరాబాద్, ఆగస్టు 18 (ప్రభాత ఉదయం)**

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కళ్యాణ లక్ష్మి షాది, ముబారక్ గ్రీన్ చానెల్ ద్వారా నిధులు విడుదల చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కళ్యాణ లక్ష్మి పథకంపై వివరించారు. కళ్యాణ్ లక్ష్మి పథకం పై ఇప్పటివరకు జారీ చేసిన 8 జీవోలను ఒక పిటిషన్ హైకోర్టులో వేసిందన్నారు. అందులో భాగంగా ఈ పథకాన్ని ఆపాలని హైకోర్టు మధ్యంతర ఆదేశాలకు ఇవ్వడం జరిగింది. దీనిపై డివిజనల్ బెంచ్ కు అప్పీల్ కై వెళుతున్నాము. సానుకూల నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నాం అని మంత్రి తెలిపారు. ఈ పథంలోని లొసుగులు ఏదైనా ఉంటే అది గత ప్రభుత్వం 2014లో చేసిన పొరపాటు వల్ల తలెత్తినది. అప్పుడు సరైన రీతులో ఉత్తర్వులు ఇచ్చి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. తమ ప్రభుత్వం త్వరలో గత ప్రభుత్వం చేసిన అన్ని తప్పిదాలను సరిచేసి ఈ పథకం కొనసాగేలా చేస్తామన్నారు. గత ప్రభుత్వం పథకం లోప భూయిష్టమైన జీవోలు ఇవ్వడం వల్లే ఈ పథకం ..మిగతా 2లో

# సర్ జాబితా విడుదల

**78.30 శాతం ఎన్యూమరేషన్ పత్రాల స్వీకరణ**

**నోటీసులు అందుకోనున్న 92 లక్షల మంది సంబంధిత పత్రాలను సమర్పించాలి**

**ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు అభ్యంతరాల స్వీకరణ**

**2.73 శాతం మంది చనిపోయిన వారిగా గుర్తింపు**

**సుమారు 60 లక్షల మంది అనామలీస్ ఓటర్లు**

**32 లక్షల మంది ఓటర్లు మ్యాపింగ్ చేసుకోలేదని గుర్తింపు**

**అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను విడుదల**



**హైదరాబాద్, ఆగస్టు 18 (ప్రభాత ఉదయం)**

తెలంగాణలో రాష్ట్ర ఎన్నికల సంఘం సర్ ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. సర్ ప్రక్రియలో మొదటి భాగం పూర్తయిందని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 78.30 శాతం ఎన్యూమరేషన్ పత్రాలు అందినట్లు తెలిపారు. 2.73 శాతం మంది చనిపోయినవారిగా గుర్తించినట్లు సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. మరోవైపు సుమారు 60 లక్షల మంది అనామలీస్ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. అలాగే 32 లక్షల మంది ఓటర్లు మ్యాపింగ్ చేసుకోలేదని ..మిగతా 2లో

# నిషేధిత జాబితా నుంచి భూములను తొలగిస్తాం

మొదటి పేజీ తరువాయి...

త్వరలోనే తొలగిస్తాం. దీనికి సంబంధించి ఫిర్యాదులు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 18005994788కు సంప్రదించాలన్నారు. భూములకు సంబంధించి అన్నీ సక్రమంగా ఉన్నవారు ఆందోళన చెందవద్దని పొంగులేటి అన్నారు. 22ఎ వల్ల ఇబ్బంది పడుతున్న ప్రజలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షమాపణలు చెప్పారు. దీన్ని బూచిగా చూపి ప్రజలను ఆఫీస్‌ల చుట్టూ తిప్పితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ వ్యవహారంలో సత్వర కేసుల పరిష్కారం కోసం ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. జెన్యూన్ కేసుల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 18005- 994788కి ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. మేడ్చల్ జిల్లాలో అత్యధికంగా 511 అప్లికేషన్లు, రంగారెడ్డి జిల్లాలో 146 అప్లికేషన్లు వచ్చాయి. హైదరాబాద్‌లో 49, సంగారెడ్డిలో 38 అప్లికేషన్లు వచ్చాయి. ప్రైవేట్ భూమిని 22-ఎ కింద పెట్టారని 757 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇవన్నీ 22-ఎ జాబితాలోకి ఎందుకు వచ్చాయనే అంశంపై చర్చించాం. ప్రైవేటు ఆస్తుల యజమానులను ఇబ్బందిపెట్టాలనే ఉద్దేశం మాకు లేదు. గ్రౌండ్ రియాలిటీ ఎలా ఉందనే అంశంపై సమీక్షించాం. న్యాయంగా ఉన్నవాటిని త్వరలోనే నిషేధిత జాబితా నుంచి తొలగిస్తాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు. కోర్టులకు వెళ్లాల్సిన పనిలేదు. అధికారులకు అప్లికేషన్స్ ఇస్తే చాలని మంత్రి వివరించారు. న్యాయబద్ధమైన మీ ఆస్తులకు తొందరగా క్లియరెన్స్ అభిస్తుంది. ప్రజలు ఆందోళన చెందవద్దు. కొన్ని ప్రాంతాల్లో అధికారుల తప్పిదాలను గుర్తించాం. కోర్టు ఆదేశాలను ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ చేయకపోవడం వల్లే సమస్య ఏర్పడింది. అధికారుల తప్పిదాలను సవరణ చేస్తున్నాం. నిజమైన కేసులు త్వరలోనే పరిష్కారం అవుతాయని అన్నారు.

# సర్ జాబితా విడుదల

మొదటి పేజీ తరువాయి...

గుర్తించారు. ఈ నేపథ్యంలో సుమారు 92 లక్షల మందికి నోటీసులు జారీ చేయనున్నట్లు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు సంబంధిత పత్రాలను సమర్పించి తమ వివరాలను నిర్ధారించు కోవాలని సూచించారు. నోటీసులు అందుకున్న వారు వీలైనంత త్వరగా స్పందించాలని కోరారు. ఏ కారణంతో నోటీసు జారీ చేశావటరీ స్పష్టంగా తెలియజేస్తామని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఓటు తొలగింపుపై అభ్యంతరాలు ఉన్నవారు తమ అభ్యంతరాలను సమర్పించవచ్చని పేర్కొన్నారు. ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు అభ్యంతరాలు, సంబంధిత దరఖాస్తులను పరిశీలించనున్నట్లు సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. పరిశీలన ప్రక్రియ పూర్తయిన అనంతరం అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నట్లు తెలిపారు. సర్ ప్రక్రియను పూర్తి చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 2 వేల మందికి పైగా అధికారులు పాల్గొంటారని సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. ఎవరి ఓట్లు అయినా లేకపోతే ఫారం 6ఏ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ముసాయిదా జాబితాను ఎన్నికల అధికారులు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

## బీజేపీ జాతీయ కార్యవర్గంలో భారీ మార్పులు

మొదటి పేజీ తరువాయి...

ఇన్‌చార్జ్‌గా తరుణ్ చుగ్‌ను నియమించారు. ఓబీసీ విభాగానికి కొత్త అధ్యక్షుడిగా అమర్‌పాల్ మౌర్యను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఆర్థిక వ్యవహారాల్లోనూ కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను పార్టీ కోశాధికారిగా నియమించారు. ఇప్పటివరకు ఈ బాధ్యతలు నిర్వహించిన రాజేష్ అగర్వాల్ స్థానంలో పీయూష్ గోయల్ బాధ్యతలు చేపట్టనున్నారు.

## కళ్యాణ లక్ష్మి కొనసాగుతుంది

మొదటి పేజీ తరువాయి...

ఇలా అయిందన్నారు. కౌంటర్ ఫైల్ చేయడానికి అధికారుల లోపమా లేదా ప్రభుత్వంలో న్యాయపరమైన అంశాలు చూసే వారి లోపమా అని విచారణ చేస్తున్నాం.. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. తెలంగాణ ప్రజలకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం స్పష్టం చేశారు.

## డబ్బులు దండుకోవడానికే నిషేధిత జాబితా..

మొదటి పేజీ తరువాయి...

లేదనడానికి ఇదే నిదర్శనమన్నారు. ఏకంగా ఎయిర్‌పోర్ట్, ఔటర్ రింగ్ రోడ్డు లాంటి ప్రభుత్వ భూములను కూడా 22ఎ నిషేధిత జాబితాలో పెట్టారంటే ఈ అధికారుల పనితీరు ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. హైదరాబాద్ నగరంలో లక్షలాది ప్రాపర్టీలను రాత్రికి రాత్రి ప్రొహిబిషన్ లిస్ట్‌లో చేర్చారు. శ్రీనగర్ కాలనీ సర్వే నంబర్ 8, 9లలో గత 20 ఏళ్లుగా ఇళ్లు కట్టుకుని ప్రశాంతంగా నివసిస్తున్న ప్రజల ప్రాపర్టీలను కూడా ఇపడు 22ఎలో పెట్టడం దుర్మార్గం. 30 ఏళ్ల క్రితం కొనుక్కున్న అపార్ట్‌మెంట్ ప్లాట్లను కూడా నిషేధిత జాబితాలో పెడితే ఆ ప్రజలు ఇపడు ఎక్కడికి పోవాలని హరీశ్ రావు ప్రశ్నించారు. తమ ప్రాపర్టీ 22ంలో ఉందన్న విషయం చాలామంది సామాన్యులకు తెలియడం లేదు. తీరా రిజిస్ట్రేషన్ కోసం చలాన్లు కట్టి, డబ్బులు చెల్లించిన తర్వాత.. చివర్లో మీ భూమి 22ఎ లో ఉందని చెప్పి రిజిస్ట్రేషన్ ఆపేస్తున్నారు. పైగా రిజిస్ట్రేషన్ కోసం కట్టిన చలాన్ డబ్బులు కూడా వాపస్ ఇవ్వకుండా ప్రభుత్వం ప్రజల సొమ్మును నిలువునా దోచుకుంటోందని మండిపడ్డారు. గతంలో ప్రభుత్వం నుంచి అధికారికంగా ఔక్షఅ వచ్చిన భూములకు బ్యాంకులు కూడా లోన్లు ఇచ్చాయి. ఇపడు అవే భూములను తీసుకొచ్చి 22ఎ లో పెట్టడంతో అటు ప్రజలు, ఇటు బ్యాంకులు ఇద్దరూ ఆగం అవుతున్నారు. బంజారాహిల్స్ హౌసింగ్ సొసైటీ లాంటి ప్రాంతాలను సైతం ప్రొహిబిషన్ లో పెట్టారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు హరీశ్ రావు. 22ఎ అనేది ఈ ప్రభుత్వానికి ప్రజలను అడ్డగోలుగా దోచుకునే ఒక ఆయుధంగా మారిందన్నారు. రెవెన్యూ శాఖలో ఏ పని కావాలన్నా, 22ం నుంచి భూమిని బయటకు తీయాలన్నా 30 శాతం కమీషన్ ఇవ్వాలనేది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం. 30 శాతం కమీషన్ లేనిదే రెవెన్యూ శాఖలో ఒక్క ఫైల్ కూడా కదలడం లేదు. చివరికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇల్లు కూడా 22ఎ ప్రొహిబిషన్ లిస్ట్‌లో ఉందంటే ఆశ్చర్యం కలుగుతోంది. తన సొంత ఇంటికి సెగ తగిలే సరికి ప్రభుత్వంలో హడావిడి మొదలైందన్న హరీశ్ రావు. మీకు చురుకు తగిలితేనే కానీ సామాన్యుల బాధలు పట్టవా స్వయంగా ముఖ్యమంత్రి పరిస్థితే ఇలా ఉంటే, ఇక రాష్ట్రంలో సామాన్య ప్రజల పరిస్థితి ఏంటి. వాళ్ల గోడు ఎవరు వినాలి. హంతకుడే సంతాప సభ పెట్టినట్లు ఉంది ఈ ప్రభుత్వ తీరని హరీశ్ రావు ఎద్దేవా చేశారు.

# సనత్ నగర్ టిమ్స్ ప్రారంభోత్సవం

మొదటి పేజీ తరువాయి...

చేస్తున్నామని పేర్కొన్నారు. 2027 డిసెంబర్ నాటికి రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ఆస్పత్రులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి ఆరు నెలలకు ఒక ఆస్పత్రిని ప్రారంభించే దిశగా ప్రణాళిక రూపొందించామని సీఎం వెల్లడించారు. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయిస్తోందని తెలిపారు. ఆస్పత్రుల నిర్మాణ పనులు వేగంగా, నాణ్యతతో పూర్తయ్యేలా ప్రత్యేక అధికారులను నియమించి పర్యవేక్షణ చేపడుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రజా ప్రభుత్వం వ్యవసాయం, మహిళా సంక్షేమంతో పాటు విద్య, వైద్యాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుందని, మన బిడ్డలను ప్రపంచంలోనే గొప్ప స్థానాల్లో చూడాలని నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకున్నాం అని సిఎం అన్నారు. నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ, జపాన్ దేశాల్లోనూ అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈరోజుల్లో ప్రైవేటు వైద్యం అత్యంత ఖరీదుగా మారింది. అందుకే పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు టిమ్స్ ను ప్రారంభించుకున్నాం సీఎంఆర్ఎఫ్ కోసం రూ. 2526 కోట్లు ఖర్చు చేశాం. ఇప్పటి వరకు రూ. 5226 కోట్లు పేదల ఆరోగ్యం కోసం ఖర్చు చేశాం. రెండేళ్లలో రూ. 21,800 కోట్లు వైద్య ఆరోగ్య శాఖ కోసం ఖర్చు చేశాం. ఉస్మానియా ఆసుపత్రి శిథిలావస్థకు చేరితే, పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు కొత్త ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించాలని ప్రయత్నించలేదు. టిమ్స్ ఆసుపత్రులు, వరంగల్ ఆసుపత్రికి కేవలం టెంకాయకొట్టి వదిలేశారు. మేం అధికారంలోకి వచ్చాక సనత్ నగర్, ఎల్బీ నగర్, అల్వాల్ టిమ్స్, వరంగల్ ఆసుపత్రులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నాం అని సిఎం వివరించారు. ఇవన్నీ పూర్తయితే 10 వేల పడకల ఆసుపత్రులు అందుబాటులోకి వస్తాయి. 2027, డిసెంబర్ 9 వరకు ఉస్మానియా, ఎల్బీ నగర్, అల్వాల్, వరంగల్ ఆసుపత్రులను పూర్తి చేస్తాం. అన్నారు. కార్యక్రమంలో మంత్రులు దావటరీదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



# తిరుపతి పాదయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు, ఆగస్టు 17 (ప్రభాత ఉదయం)**

పటాన్ చెరు పట్టణానికి చెందిన సీసాల రాజు ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నిర్వహిస్తున్న పటాన్ చెరు--తిరుపతి పాదయాత్రను సోమవారం పట్టణంలోని మహంకాళి దేవాలయం వద్ద పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో వరుసగా 22 సంవత్సరాలుగా తిరుపతికి పాదయాత్ర నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఆధ్యాత్మిక విశ్వాసంతో చేపడుతున్న ఈ పాదయాత్ర విజయవంతంగా సాగాలని, యాత్రికులందరికీ శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆశీస్సులు లభించాలని ఆకాంక్షించారు. అనంతరం కిష్టారెడ్డిపేటకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు మాణిక్యం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తిరుపతి పాదయాత్రను కూడా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా యాత్రికులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారు సురక్షితంగా తిరుపతి చేరుకుని స్వామివారిని దర్శించుకోవాలని ఆకాంక్షించారు.



# నూతన కాలనీల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా నిధుల కేటాయింపు: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

### అంజనాద్రి నగర్‌లో రూ.20 లక్షలతో యుజిడి పనులకు శంకుస్థాపన

**అమీన్ పూర్, ఆగస్టు 17(ప్రభాత ఉదయం)**

నూతనంగా ఏర్పడుతున్న కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని పటాన్చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బీరంగూడ డివిజన్ పరిధిలోని నర్రేగూడెం అంజనాద్రి నగర్ కాలనీలో రూ. 20 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న యుజిడి (అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ) పనులకు సోమవారం ఎమ్మెల్యే జిఎంఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన రహదారులు, డ్రైనేజీ, తాగునీరు తదితర సౌకర్యాలను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. నూతన కాలనీల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తూ వాటిని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. య యుజిడి పనులు పూర్తయితే కాలనీ ప్రజలకు మురుగునీటి సమస్య నుంచి శాశ్వత పరిష్కారం లభిస్తుందని, పరిశుభ్రమైన వాతావరణం ఏర్పడుతుందని ఎమ్మెల్యే అన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బాలరాజు, ఇంజనీరింగ్ విభాగం డిప్యూటీ ఇంజనీర్ వెంకటరమణ, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

Electors as on 17.08.2026

| AC No. | AC Name | Male | Female | Third Gender | Total |
|---|---|---|---|---|---|
| 48 | Ibrahimpatnam | 129464 | 129835 | 18 | 259317 |
| 49 | Lal Bahadur Nagar | 169718 | 168135 | 66 | 337919 |
| 50 | Maheswaram | 168622 | 170654 | 30 | 339306 |
| 51 | Rajendranagar | 195556 | 192706 | 16 | 388278 |
| 52 | Serilingampally | 226448 | 217030 | 66 | 443544 |
| 53 | Chevella | 108833 | 109438 | 3 | 218274 |
| 83 | Kalwakurthy | 109734 | 107153 | 3 | 216890 |
| 84 | Shadnagar | 104006 | 105111 | 7 | 209124 |
| Total | | 1212381 | 1200062 | 209 | 2412652 |

# జిల్లాస్థాయిలో ముసాయిదా ఓటరు జాబితా విడుదల

### సెప్టెంబర్ 16లోగా క్లెయిమ్‌లు, అభ్యంతరాలు, మార్పులు, సవరణలకు దరఖాస్తు చేసుకోవాలి

రంగారెడ్డి జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా 17 తేదీన ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణ రెడ్డి తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితాలో తమ పేరు, ఇతర వివరాలను ప్రతి అర్హత కలిగిన ఓటరు పరిశీలించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి సూచించారు. ఓటరు జాబితాలో పేరు లేకపోయినా, వివరాల్లో తప్పులు ఉన్నా లేదా మార్పులు, సవరణలు అవసరమైనా సెప్టెంబర్ 16, 2026లోగా సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించి నిర్ణీత విధానంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

**జిల్లాలో 24,12,652 మంది ఓటర్లు**

17 తేదీ నాటికి జిల్లాలోని సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గాల ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం మొత్తం 24,12,652 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 12,12,381 మంది పురుషులు, 12,00,062 మంది మహిళలు, 209 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు.

**నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు:**

- 48--ఇబ్రహీంపట్నం: 2,59,317
- 49--ఎల్.బి. నగర్: 3,37,919
- 50--మహేశ్వరం: 3,39,306
- 51--రాజేంద్రనగర్: 3,88,278
- 52--శేరిలింగంపల్లి: 4,43,544
- 53--చేవెళ్ల: 2,18,274
- 83--కల్వకుర్తి: 2,16,890
- 84--షాద్‌నగర్: 2,09,124

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి,ఆగస్టు17(ప్రభాత ఉదయం)

జిల్లాలో అత్యధికంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 4,43,544 మంది ఓటర్లు ఉండగా, ఆ తరువాత రాజేంద్రనగర్‌లో 3,88,278 మంది, మహేశ్వరంలో 3,39,306 మంది ఓటర్లు ఉన్నారని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.

ప్రతి అర్హత కలిగిన ఓటరు పేరు పరిశీలించుకోవాలి

అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, అనర్హుల పేర్లు లేకుండా పారదర్శకమైన, తప్పులులేని ఓటరు జాబితా రూపొందించడమే లక్ష్యంగా ఎస్ ఐ ఆర్ ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు సి. నారాయణ రెడ్డి తెలిపారు.

ముసాయిదా జాబితాలో పేరు లేని అర్హత కలిగిన వ్యక్తులు, అలాగే ఓటరు వివరాల్లో మార్పులు లేదా సవరణలు కోరుకునే వారు నిర్ణీత గడువులోగా క్లెయిమ్‌లు, అభ్యంతరాలు లేదా సవరణలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముసాయిదా ఓటరు జాబితాపై అందిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి తుది ఓటరు జాబితా రూపొందిస్తామని జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణ రెడ్డి తెలిపారు.

అర్హత కలిగిన ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ముసాయిదా ఓటరు జాబితాలో తమ పేరు, వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని ఆయన కోరారు.



డాక్టర్‌అంబేద్కర్ ,బాబు జగజీవన్ రామ్ విగ్రహాలకు వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు..

# కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌పై కాంగ్రెస్ కుట్ర:

### బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్ గౌడ్ ధ్వజం

**శేరిలింగంపల్లి : ఆగష్టు 17, (ప్రభాత ఉదయం)**

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రమైన కుట్రకు పూనుకుందని మాదాపూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ పథకాల్లో ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యానికి నిరసనగా నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా ప్రభుత్వానికి కళ్లు తెరిపించాలని కోరుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, దళిత నేత బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహాలకు వినతిపత్రాన్ని అందజేశారు. అభివృద్ధిని, ఆడబిడ్డల భవిష్యత్తును అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధకుడు తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పేదింటి ఆడబిడ్డల కల నెరవేర్చేందుకు మేనమామగా రూ లక్ష 116 అందించి మహత్తరమైన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఈ పథకాల వల్ల బాల్యవివాహాలు తగ్గి ఆడపిల్లలు 18 సంవత్సరాల వరకు చదువుకునే అవకాశం లభించిందని తెలిపారు.

**హామీలను విస్మరించిన రేవంత్ ప్రభుత్వం**

అధికారంలోకి రాకముందు రూ. 1,00,116తో పాటు తులం బంగారం ఇస్తామని ఆశ చూపి ఓట్లు దండుకున్న కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చాక ఆ హామీని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ఆడబిడ్డలు తులం బంగారం గురించి ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పలేక, పథకాన్ని పూర్తిగా రద్దు చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నిందని ఆరోపించారు. కోర్టు స్టే ఎత్తివేసి చెక్కులు పంపిణీ చేయాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. హైకోర్టు నాలుగు నెలల సమయమిచ్చినా కౌంటర్ దాఖలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, ఫలితంగానే స్టే వచ్చిందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే కోర్టులో కౌంటర్ దాఖలు చేసి స్టే తొలగిపోయేలా చర్యలు తీసుకోవాలని, అలాగే నిలిచిపోయిన ఆసరా పెన్షన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే సిద్ధంగా ఉన్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను వెంటనే లబ్ధిదారులకు పంపిణి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సైబరాబాద్‌లో ట్రాఫిక్ భద్రతపై జాయింట్ సీపీ మార్క్

### ఖాజాగూడ డీపీఎస్ వద్ద పాత యూ-టర్న్ బంద్ 70 మీటర్ల ముందే కొత్తది!

### మల్కంచెరువు వద్ద డేంజర్ యూ-టర్న్ ఎత్తివేతకు ఆదేశం నేరుగా రంగంలోకి దిగిన ట్రాఫిక్ జాయింట్ సీపీ సున్‌ప్రీత్ సింగ్

**శేరిలింగంపల్లి : ఆగష్టు 17,(ప్రభాత ఉదయం)**

సైబరాబాద్ పరిధిలో ప్రజలు సురక్షితమైన, రద్దీ లేని ట్రాఫిక్ వ్యవస్థను అందించడమే లక్ష్యంగా పోలీస్ యంత్రాంగం క్షేత్రస్థాయి చర్యలను తీవ్రతరం చేసింది. దీనిలో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సున్‌ప్రీత్ సింగ్, సోమవారం ఖాజాగూడ, మల్కంచెరువు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. స్థానిక ట్రాఫిక్ అధికారులతో కలిసి పర్యటించిన ఆయన, క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను స్వయంగా పరిశీలించి వాహనదారులకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్న పాయింట్లపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు.



ట్రాఫిక్ అంతరాయాలప క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్న జాయింట్ సీపీ ఇతర అధికారులు...

**రాంగ్ రూట్ ప్రయాణాలకు చెక్:**

ఖాజాగూడలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వద్ద నిత్యం పెరిగిపోతున్న ట్రాఫిక్ రద్దీ, రాంగ్ రూట్ ప్రయాణాలను అరికట్టేందుకు జాయింట్ సీపీ ప్రత్యేక దృష్టి సారించారు. ప్రస్తుతం ఉన్న పాత యూ-టర్న్‌ను పూర్తిగా మూసివేసి, దానికి సుమారు 70 మీటర్ల ముందే నూతన యూ-టర్న్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. నూతన యూ-టర్న్ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించి, అక్కడ ఉన్న స్థానిక ప్రజలతో మాట్లాడి వారి అభిప్రాయాలను సేకరించారు. ఈ మార్పు వల్ల ప్రమాదాలు తగ్గడమే కాకుండా, రాంగ్ రూట్ డ్రైవింగ్‌కు అడ్డుకట్ట పడుతుందని స్పష్టం చేశారు.

**మల్కంచెరువు వద్ద గందరగోళానికి ముగింపు:**

అనంతరం మల్కంచెరువు వెనుక వైపు ఉన్న హైటెన్షన్ రోడ్డును సందర్శించిన జాయింట్ సీపీ, అక్కడి ట్రాఫిక్ పరిస్థితులను సమీక్షించారు. అతి తక్కువ దూరంలోనే రెండు యూ-టర్న్‌లు ఉండటం వల్ల వాహనదారులు తీవ్ర గందరగోళానికి గురై ప్రమాదాల బారిన పడుతున్నారని గుర్తించారు. ఈ ముప్పును నివారించేందుకు ఆ రెండు యూ-టర్న్‌లను తక్షణమే మూసివేయాలని ఆదేశించారు.

రోడ్డు భద్రతను మెరుగుపరచడం, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడం వాహనాల సజావు రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా అవసరమైన అన్ని రక్షణ చర్యలు వెంటనే చేపట్టాలని శేరిలింగంపల్లి ఏడీసీపీ మాదాపూర్ ఏసీపీ రాయదుర్గం ఎస్ హెచ్ ఓ లను ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో పలువురు స్థానిక ట్రాఫిక్ అధికారులు పాల్గొన్నారు.

# పథకాల అమలులో ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలను వెంటనే పునరుద్ధరించాలి..**

**కల్యాణలక్ష్మి,షాదీ ముబారక్ పథకాలను రద్దు చేసే కుట్ర..**

**తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ధర్నా..**

**కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై బీఆర్ఎస్ నేతల ఆగ్రహం**

**రాజేంద్రనగర్,ఆగస్టు17(ప్రభాత ఉదయం)**





కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ ఆధ్వర్యంలో సోమవారం రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు,రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ నిరసనలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.అనంతరం ఆర్ఐ శ్రీవాణికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ... పేదింటి ఆడబిడ్డల ఆత్మగౌరవానికి,ఆర్థిక భరోసాకు ప్రతీకగా నిలిచిన కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలను నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు రాష్ట్రంలోని ఆడబిడ్డలకు ఇచ్చే కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకంలో అదనంగా తులం బంగారం ఇస్తామని చెప్పి మహిళలను మోసం చేసి ఓట్లు దండుకుని అధికారానికి వచ్చిందని మండిపడ్డారు.హైకోర్టు తీర్పును సాకుగా చూపి పేద కుటుంబాలకు అండగా నిలిచిన సంక్షేమ పథకాలను రద్దు చేసే ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండించారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం పేద కుటుంబాల్లో ఆడబిడ్డ వివాహం ఆర్థిక భారంగా మారుతున్న పరిస్థితిని గుర్తించిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ 2014 అక్టోబర్2న కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలను ప్రారంభించారని తెలిపారు.ప్రారంభంలో రూ.51వేలుగా ఉన్న ఆర్థిక సహాయాన్ని దశలవారీగా రూ.75,116కు,అనంతరం రూ.1,00,116కు పెంచి పేద కుటుంబాలకు అండగా నిలిచారని పేర్కొన్నారు.కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సుమారు 13లక్షల మంది ఆడబిడ్డల కుటుంబాలకు రూ.13వేల కోట్ల మేర ఆర్థిక సహాయం అందించారని తెలిపారు.కరోనా వంటి తీవ్ర ఆర్థిక సంక్షోభ సమయంలోనూ కళ్యాణ లక్ష్మి పథకాన్ని కొనసాగించి పేద కుటుంబాలకు భరోసా కల్పించారని గుర్తుచేశారు.ఎన్నికల సమయంలో కళ్యాణ లక్ష్మితో పాటు ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని,అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అమలు చేయకపోగా ఉన్న పథకాలను కూడా నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందని వెంకటేష్ విమర్శించారు.అర్హత ఉన్న అనేక మంది లబ్ధిదారులకు వివాహాలు పూర్తయి చాలా కాలం గడిచినా ఆర్థిక సహాయం అందక ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.హైకోర్టులో కళ్యాణ లక్ష్మి అంశంపై ప్రభుత్వం వ్యవహరించిన తీరును కూడా ఆయన ప్రశ్నించారు.నాలుగుసార్లు గడువు ఇచ్చినా ప్రభుత్వం ఎందుకు కౌంటర్ దాఖలు చేయలేదని నిలదీశారు.పేదింటి ఆడబిడ్డల ప్రయోజనాలకు సంబంధించిన కీలక అంశంలో ప్రభుత్వం సమర్థవంతంగా న్యాయపోరాటం చేయాల్సిన బాధ్యత ఉందన్నారు.ముఖ్యమంత్రి,మంత్రులకు సంబంధించిన వివిధ కేసుల్లో భారీ మొత్తాలు వెచ్చించి న్యాయవాదులను నియమించుకునే ప్రభుత్వం,పేదింటి ఆడబిడ్డల ప్రయోజనాలకు సంబంధించిన కళ్యాణ లక్ష్మి పథకాన్ని కాపాడేందుకు ఎందుకు సమర్థవంతంగా న్యాయపోరాటం చేయలేదని ప్రశ్నించారు.కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలు కేవలం ప్రభుత్వ పథకాలు మాత్రమే కాదని,తెలంగాణలోని పేదింటి ఆడబిడ్డల ఆత్మగౌరవం,భవిష్యత్తు,కుటుంబాలకు ఆర్థిక భరోసాతో ముడిపడిన సంక్షేమ కార్యక్రమాలని పేర్కొన్నారు.హైదర్‌గూడ డివిజన్ అధ్యక్షుడు నరేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ...రాజకీయ కక్ష సాధింపులను పక్కనపెట్టి కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలను పూర్తిస్థాయిలో కొనసాగించాలని,పెండింగ్‌లో ఉన్న అర్హులైన లబ్ధిదారుల దరఖాస్తులను వెంటనే పరిష్కరించి ఆర్థిక సహాయం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు గుమ్మడి కుమార్ మాట్లాడుతూ...తెలంగాణ ఆడబిడ్డలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని,తులం బంగారం హామీని నిలబెట్టుకోవాలని,కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేయకూడదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శీలం తిరుపతిరెడ్డి, ఎర్రోళ్ల యాదయ్, నోములరాము యాదవ్,అక్కం రఘు యాదవ్,రాజేష్ యాదవ్,కార్మిక విభాగం అధ్యక్షుడు ఉప్పల్ శ్రీనివాస్,జహీర్ ఖాన్,సరికొండ దుర్గేష్,అశోక్ కుమార్,చిరంజీవి,రవీందర్ యాదవ్,అరుణ రెడ్డి,సరిత,మహేష్,సుగుణమ్మ,ప్రసన్న,మంజుల,పద్మ,పుష్ప,భాగ్యమ్మతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు,కార్యకర్తలు పాల్గొన్నారు.



రైతులకు యంత్రాలను అందచేస్తున్న ఐ ఐ ఎం ఆర్ ఇంచార్జి డైరెక్టర్ డాక్టర్ శ్యామ ప్రసాద్

## చిరుధాన్యాల సాగుపై మంచిర్యాల రైతులకు అవగాహన, శిక్షణ కార్యక్రమం

**బుద్వేల్, ఆగస్టు 17 (ప్రభాత ఉదయం)**

మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం, తీకన్పల్లి గ్రామానికి చెందిన 45 మంది రైతులకు రాజేంద్రనగర్ లోని జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ లో చిరుధాన్యాల సాగు పై అవగాహన కల్పించారు. చిరుధాన్యాల ఉత్పత్తి సాంకేతికతలు, ప్రాసెసింగ్, విలువ జోడింపు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమం ఎస్సీ సబ్ ప్లాన్ ద్వారా చేపట్టారు. ఎస్సీ సబ్ ప్లాన్ చైర్మన్ డాక్టర్ కలై శేఖర్ మార్గదర్శనంలో చిరుధాన్యాల పరిశోధన సంస్థ సీనియర్ సైం టీస్ట్ డాక్టర్ ఎ శ్రీనివాస్ ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు. సంస్థ ఇంచార్జి డైరెక్టర్ డాక్టర్ శ్యామ్ ప్రసాద్ మార్గదర్శనంలో గ్లోబల్ సెంటర్ ఆన్ ఎక్సలెన్స్ ఆన్ మిల్లెట్స్ సహకారంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. రైతులకు డాక్టర్ డి సేవా నాయక్, డాక్టర్ ఆర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సంగప్ప, డాక్టర్ లక్ష్మీ ప్రసన్న లు మెరుగైన చిరుధాన్యాల ఉత్పత్తి, సాంకేతికతలు, క్షేత్రస్థాయి సాగు పద్ధతులపై సాంకేతిక అవగాహన కల్పించారు.

## రాజేంద్రనగర్‌లో పశువైద్య సంచార వాహనం ఆకస్మిక తనిఖీ..


**రాజేంద్రనగర్,ఆగస్టు17(ప్రభాత ఉదయం)**




రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ డివిజన్‌కు కేటాయించిన పశువైద్య సంచార వాహనాన్ని ప్రోగ్రామ్ మేనేజర్ జాన్ షాహిద్,జిల్లా మేనేజర్ పాక శ్రీహరి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వాహనంలో అందుబాటులో ఉన్న పశువైద్య మందులు,వైద్య పరికరాలు,సేవలకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు.పశువులకు అత్యవసర వైద్య సేవలు అందించడంలో సంచార పశువైద్య వాహనం కీలకంగా పనిచేస్తుందని వారు తెలిపారు.రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలో ఏ ప్రాంతం నుంచి పశువైద్య సేవల కోసం సమాచారం వచ్చినా ఆలస్యం చేయకుండా వెంటనే అక్కడికి చేరుకుని పశువులకు అవసరమైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.పశువులకు అనారోగ్యం,గాయాలు,అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు రైతులు సంచార పశువైద్య వాహనం సేవలను వినియోగించుకోవాలని కోరారు.పశువుల ఆరోగ్య పరిరక్షణతోపాటు రైతులకు పశు సంపద ద్వారా మెరుగైన ఆదాయం లభించేలా వైద్య సేవలను సమర్థవంతంగా అందించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని పేర్కొన్నారు.వాహనంలో అవసరమైన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని,వైద్య సేవలకు సంబంధించిన రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు.సంచార వాహనం ద్వారా అందించే సేవలపై గ్రామీణ ప్రాంతాల రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు.రైతులు తమ పశువులకు సకాలంలో వైద్యం అందించడం ద్వారా వ్యాధుల తీవ్రతను తగ్గించుకోవచ్చని,అత్యవసర పరిస్థితుల్లో ఆలస్యం చేయకుండా సంచార పశువైద్య వాహనం సేవలను పొందాలని సూచించారు.ఈ సందర్భంగా పశువైద్యురాలు డాక్టర్ అర్చన,సహాయకుడు మల్లేష్‌తో వాహనం ద్వారా అందుతున్న సేవలు,రైతుల నుంచి వస్తున్న సమాచారం,వైద్య సేవల నిర్వహణ తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు.డివిజన్ పరిధిలోని పశు పోషకులకు మెరుగైన సేవలు అందించేందుకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని వారికి సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్ వేర్ ఇంజనీరు దుర్మరణం

**బుద్వేల్, ఆగస్టు 17 (ప్రభాత ఉదయం)**



రమేష్ రెడ్డి

ఎదురుగా అతి వేగంతో వచ్చిన కారు ఢీ కొనడంతో ఎలక్ట్రికల్ యాక్టీవా పై కుమారుని తో కలసి వెళుతున్న ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. కుమారునికి తీవ్ర గాయాలైనాయి. రాజేంద్రనగర్ ఎస్ఐ రాఘవేందర్ తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.... ఆరె మైసమ్మ సమీపంలోని ఫిబెల్ సిటీ లో నివాసం ఉండే సాఫ్ట్వేర్ ఇంజనీరు కాకర్ల రమేశ్ రెడ్డి (40) సోమవారం ఉదయం 6 గంటలకు తన కుమారుడు ఆదిత్ (7) ను తీసుకుని ఎలక్ట్రికల్ యాక్టీవా టీఎస్ 07 జే యు7564 పై బండ్లగూడ లోని బ్యాడ్మింటన్ కోర్టుకు వస్తున్నాడు. ఆయన స్కూటీ బండ్లగూడ శ్రీ సరస్వతీ శిశుమందిరం వద్దకు రాగానే కిస్మత్పూర్ నుంచి బండ్లగూడ వైపు వేగంగా వస్తున్న టీఎస్ 07 జేక్యూ 0009 నెంబరు కారును అజాగ్రత్తగా నడుపుతున్న కిషన్ రాజ్ (32) యాక్టీవా ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో కాకర్ల రమేశ్ రెడ్డి, ఆదిత్ లు తీవ్ర గాయాలకు గురైనారు. వారిని స్థానిక ఆసుపత్రికి తరలించగా అప్పటికే రమేశ్ రెడ్డి మరణించినట్లు వైద్యులు వెల్లడించారు. ఆదిత్ కు గాయాలైనాయి. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ ఎస్ఐ రాఘవేందర్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడు రమేశ్ భార్య ప్రవీణా రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఏడు సంవత్సరాల బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన 54 సంవత్సరాల వ్యక్తికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ. 2వేల జరిమాన

**బుద్వేల్, ఆగస్టు 17 (ప్రభాత ఉదయం):**



నజీర్ మియా

ఏడు సంవత్సరాల బాలిక ను ముద్దుపెట్టుకుని అసభ్యంగా ప్రవర్తించిన దుకాణం యజమాని నజీర్ మియా (54) కు 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ. 2వేల జరిమాన విదిస్తు రాజేంద్రనగర్ పోక్సో కోర్టు న్యాయమూర్తి టి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు. వివరాలను స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వర్ రెడ్డి వెల్లడించారు. మియాపూర్ మార్తాం డ నగర్ లో 2023 మార్చి 27న కిరాణా దుకాణానికి పాల ప్యాకెట్ కోసం వచ్చిన చిన్నారి పట్ల అసభ్యం గా ప్రవర్తించిన దుకాణం యజమాని నజీర్ మియా ఆ బాలిక ను ముద్దు పెట్టుకున్నాడు. బాలిక ఇంటికి వెళ్లి తల్లికి విషయాన్ని చెప్పడంతో ఆమె మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న అప్పటి సబ్ ఇన్స్ పెక్టర్ ఆర్ దశరథ్, ఇన్స్ పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎన్ తిరుపతి రావు, ఎం. ప్రేమ్ కుమార్, ఎన్ జయరాం ల పర్యవేక్షణలో కేసు కొనసాగింది. సోమవారం తీర్పు వెలువరించిన రాజేం ద్రనగర్ పోక్సో స్పెషల్ కోర్టు న్యాయమూర్తి టి శ్రీనివాస్ నిందితుడైన నజీర్ మియా కు 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.2వేలు జరిమాన విదిస్తు తీర్పు చెప్పారు. బాధిత చిన్నారి కుటుంబానికి యా. 5లక్షల పరిహారాన్ని అందజేయాలని కోరారు.

## రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల డ్రాఫ్ట్ సిద్ధం

**బుద్వేల్ , ఆగస్టు 17 (ప్రభాత ఉదయం) :**




సోలిపేట శ్రీనివాస్ రెడ్డి

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ఓటర్ల లెక్కింపు, నమోదు ప్రక్రియ తర్వాత, రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని మొత్తం 521 పోలింగ్ స్టేషన్లలో 3,88,278 మంది ఓటర్లు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకున్నారని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. వారిలో 1,95,556 మంది పురుషులు, 1,92,706 మంది మహిళలు, 16 మంది ట్రాన్స్‌జెండర్‌లు ఉన్నారన్నారు. పోలింగ్ స్టేషన్ వారీగా డ్రాఫ్ట్ రోల్ ను సోమవారం పబ్లిష్ చేయడం జరిగిందన్నారు. రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన పౌరులందరూ తమ ఓటు వివరాలను పరిశీలించుకోవాలన్నారు . ఏవైనా అభ్యంతరాలు, సవరణలు ఉన్నట్లయితే ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు సంబంధిత దరఖాస్తు ఫారమ్‌లను పూర్తి చేసి సమర్పించవచ్చాన్నారన్నారు. ఇతర వివరాలకోసం భారత ఎన్నికల సంఘం ఈ సీ ఐ సిటిజన్ సర్వీస్ పోర్టల్ ను సందర్శించాలన్నారు . తెలంగాణ రాష్ట్ర ఎన్నికల అధికారులకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం సీ ఈ ఓ తెలంగాణ పోర్టల్‌ను కూడా చూడవచ్చన్నారు. ఓటరు జాబితాలో పేరు లేకుంటే ఫామ్ 6 పూర్తి చేసి సంబంధిత ఏ ఈ ఆర్ ఓ లకు ఇవ్వాలి:ఓటరు డ్రాఫ్ట్ జాబితా విడుదలైన తరువాత ఎవరి పేరైనా ఓటరు జాబితాలో లేనట్లయితే వారు ఫామ్ - 6 ను తగిన ఆధారాలతో పూర్తి చేసి అసిస్టెంట్ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ కు అందజేయాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రం మార్పు, పేర్లలో ఏమైనా తప్పులు దొర్లినా ఫామ్ 8 పూర్తి చేసి ఇవ్వాలని కోరారు


## జహీరాబాద్ పారిశ్రామిక స్మార్ట్ సిటీ

**హైదరాబాద్ ఆగస్ట్ 17 (ప్రభాత ఉదయం) :**

జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులన్నీ 2028 మార్చి వరకు పూర్తి చేస్తామని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. 3,245 ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్న ఈ పారిశ్రామిక వాడకు రూ.15 వేల కోట్ల పెట్టుబడులు వచ్చేలా లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆయన చెప్పారు. సోమవారం నాడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయెల్ లు న్యూఢిల్లీ నుంచి నిర్వహించిన నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ వీడియో కాన్ఫరెన్సులో శ్రీధర్ బాబు సచివాలయం నుంచి వర్చువల్ గా పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పరిశ్రమల మంత్రులు ఈ వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్నారు. జహీరాబాద్ స్మార్ట్ సిటీలో పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభమైతే ప్రత్యక్షంగా, పరోక్షంగా రెండు లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని శ్రీధర్ బాబు వివరించారు. ఈ స్మార్ట్ సిటీలో భూమి రూపంలో రాష్ట్ర ప్రభుత్వం వాటా 51 శాతం ఉండగా, కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి పనులకు నిధులు అందజేస్తోంది. ఇప్పటికే స్పెషల్ పర్పస్ వెహికల్ కు అభివృద్ధి ప్రణాళికను అందజేసినట్టు శ్రీధర్ బాబు తెలిపారు. ఇంజనీరింగ్, ప్రొక్యూర్ మెంట్, కన్ స్ట్రక్షన్ (ఇపిసి) పద్ధతిలో జరగుతున్న పనులు ముందుగా నిర్ణయించిన సమయానికి పూర్తవుతాయిని శ్రీధర్ బాబు వెల్లడించారు. నీటి సరఫరా పనుల టెండర్ల ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. విద్యుత్తు సరఫరా పనులను కూడా గడువులోగా పూర్తి చేస్తామని వివరించారు. భవ్య పథకం కింద కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 100 ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల్లో నాలుగింటిని తెలంగాణాకు కేటాయించాలని మంత్రి పీయూష్ గోయెల్ ను కోరారు. వీడియో కాన్ఫరెన్సులో టిజిఐఐసి ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ కృష్ణ ఆదిత్య, పరిశ్రమల కమిషనర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## పత్తి కుంట లో కాలుష్య వ్యర్థాలను పారబోస్తున్న ట్యాంకర్

**బుద్వేల్, ఆగస్టు 17 (ప్రభాత ఉదయం) :**




రసాయన వ్యర్థాలను పత్తికుంట లో డంప్ చేస్తున్న ట్యాంకర్ ను పట్టుకున్న స్థానికులు

రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్ల పరిధిలో వర్షపు నీటితో కళకళలాడే పత్తి కుంట చెరువులో నగర శివారు ప్రాంతాల నుండి డ్రైనేజీ వ్యర్థాలను తీసుకువచ్చి పరబోస్తున్న వారిని స్థానికులు ఎట్టకేలకు పట్టుకున్నారు.సోమవారం సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో కుంటలో వ్యర్థాలను పైపు ద్వారా డంప్ చేస్తుండగా రెడ్ అండ్ గా పట్టుకొని రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు. రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిల్లో పరిధిలో ప్రస్తుతం ఉన్న కుంటలు చెరువులలో పత్తికుంట మాత్రమే స్థానికంగా వరద నీటితో నిండుకొని కళకళలాడుతోంది.ఈ చెరువులోనే స్థానిక ప్రాంతాలకు చెందిన వారు గణేష్ లతో పాటు బతుకమ్మలను నిమర్జనం చేస్తారు. కలుషితం కాకుండా ఉన్న ఈ ఏకైక చెరువును స్థానికులు, ప్రజాప్రతినిధులు అంతా కలిసి ప్రస్తుతం అభివృద్ధి పరుస్తున్నారు. చెరువు అభివృద్ధి కోసం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించి వాకింగ్ ట్రాక్, చుట్టూ ఫెన్సింగ్,వీధి దీపాలు తదితర అభివృద్ధి పనులను చేపడుతున్నారు. కాగా కొన్ని రోజులుగా నగర శివారు ప్రాంతాల నుండి డ్రైనేజీ వర్థాలను తీసుకువచ్చి ఈ కుంటలో వదులుతున్నారు. దీంతో నీరు కలుషితం కావడంతో పాటు దుర్గంధ భరితంగా మారింది. వాహనాలను పట్టుకునేందుకు స్థానికులు గత కొన్ని రోజులుగా ప్రయత్నిస్తున్నారు. సోమవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో శంషాబాద్ రామంజాపూర్ ప్రాంతానికి చెందిన డ్రైనేజీ వ్యర్థాలతో నిండుకొని ఉన్న వాహనాన్ని డ్రైవర్ తోపాటు మరో ఇద్దరు యువకులు తీసుకువచ్చి డంపు చేస్తున్నారు. విషయాన్ని గమనించిన స్థానికులు రెడ్ అండ్ గా పట్టుకొని రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు. వాహనాన్ని జప్తు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంలో జిహెచ్ఎంసి అధికారులు సైతం వాహన యజమానికి నీటిని కలుషితం చేసినందుకు జరిమానా విధించాలని కోరుతున్నారు.

# కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలను యదావిదిగా కొనసాగించాలి

## బీఆర్ఎస్ నాయకుల డిమాండ్

**బుద్వేల్, ఆగస్టు 17 (ప్రభాత ఉదయం)**






రాజేంద్రనగర్ తహసిల్దార్ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలుపుతున్న బీ ఆర్ ఎస్ నాయకులు

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశ పెట్టిన కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలను యాదావిదిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తు సోమవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించి ఉయ్నిరసన కు దిగారు. హో కోర్టు తీర్పును సాకుగా చూపి పేదింటి ఆడబిడ్డలకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేయ్యోద్దు అంటు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై వారు అభ్యంతరం, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు ఎస్ వెంకటేశ్, మైలార్దేవుపల్లి, రాజేంద్రనగర్ డివిజన్ల అధ్యక్షులు గుమ్మడి కుమార్, చెట్టిగారి నరేందర్ రావు లు మాట్లాడుతూ, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను పునరుద్దరిం చాలన్నారు. పేదింటి ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ఆర్థిక భరోసాగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎర్రోళ్ల యాదయ్య, శీలం తిరుపతి రెడ్డి, నోముల రాము యాదవ్, అక్కెం రాఘవేందర్ యాదవ్, రాజేశ్ యాదవ్, ఉప్పల్ శ్రీనివాస్, జహీర్ ఖాన్, సరికొండ దుర్గేశ్, అశోక్ కుమార్, చిరంజీవి, రవీందర్ యాదవ్, అరుణారెడ్డి, ఎర్వ సరితా మహేశ్, సుగుణమ్మ, ప్రసన్న, మంజుల, పద్మ, పుష్మ, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

# షాదీ ముబారక్ రద్దు కుట్రపై మండిపడ్డ మహిళా లోకం:



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న మారబోయిన రవికుమార్ యాదవ్.




పాపిరెడ్డి నగర్‌లో పొట్ట నరేందర్ యాదవ్ నిరసన రాలీ..

## శేరిలింగంపల్లిలో బీఆర్ఎస్ నిరసనల హోరెత్తు..

### అంతర్గత పోరుపై శ్రేణుల ఆందోళన

**శేరిలింగంపల్లి : ఆగస్టు 17, (ప్రభాత ఉదయం)**

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. బీఆర్ఎస్ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'షాదీ ముబారక్' పథకంపై హైకోర్టు స్టే విధించడం వెనుక కాంగ్రెస్ ప్రభుత్వ కుట్ర ఉందంటూ బీఆర్ఎస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కావాలనే ప్రైవేట్ వ్యక్తులతో కేసులు వేయించి పథకాన్ని నిలిపివేసేలా చేసిందని, ముస్లిం మైనారిటీ పేదల పొట్ట కొట్టాలని చూస్తోందని మహిళా నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**సంక్షేమ పథకాలపై కాంగ్రెస్ గ్రహణం:**

నిరసన ప్రదర్శనలో పాల్గొన్న మహిళా నాయకురాళ్లు మాట్లాడుతూ, కేవలం షాదీ ముబారక్ మాత్రమే కాకుండా కేసీఆర్ కిట్, కళ్యాణలక్ష్మి, డబుల్ బెడ్రూమ్ ఇళ్లు, వృద్ధాప్య ఒంటరి మహిళా పెన్షన్లను కూడా నీరుగార్చేందుకు ప్రభుత్వం చూస్తోందని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను అమలు చేయలేక, శేరిలింగంపల్లి తోపాటు తెలంగాణ రాష్ట్రంలోని విలువైన ప్రభుత్వ భూములను అమ్ముకుంటూ కాలయాపన చేస్తోందని విమర్శించారు. హామీలను విస్మరించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ప్రజాక్షేత్రంలో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

**రగిలిపోతున్న 'శేరిలింగంపల్లి' రాజకీయాలు:**

ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటాలు సాగుతుంటే, మరోవైపు నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ అంతర్గత విబేధాలు కాకరేపుతున్నాయి. శేరిలింగంపల్లి డివిజన్ నేతలు పొట్ట నరేంద్ర యాదవ్, మారబోయిన రవికుమార్ యాదవ్ల మధ్య వర్గపోరు తీవ్రరూపం దాల్చింది. నిరసన వేదికలను సైతం వీరు పోటీపోటీగా నిర్వహించడం, ఒకరిపై ఒకరు ఆధిపత్యం ప్రదర్శించేందుకు యత్నించడం పార్టీ శ్రేణుల్లో తీవ్ర గందరగోళాన్ని సృష్టిస్తోంది.

**అధిష్టానపు నిర్లక్ష్యం కార్యకర్తల్లో అయోమయం**

ఇద్దరు నాయకుల మధ్య వివాదం నడుస్తున్నప్పటికీ, అధిష్టానం జోక్యం చేసుకోకపోవడంపై స్థానిక కార్యకర్తలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాజు యాదవ్ కు శ్రీరాంనగర్, మసీదు బండ డివిజన్ల నుంచి పోటీ చేసే అవకాశం ఉన్నప్పటికీ, ఇరు వర్గాల మధ్య సర్దిచెప్పడంలో పార్టీ నాయకత్వం పూర్తిగా విఫలమైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల సమయానికి ఆఖరి క్షణంలో ఎవరో ఒకరికి సీటు ఇచ్చి చేతులు దులుపుకుంటే, టికెట్ రాని వర్గం పనిచేయకుండా పోయే ప్రమాదం ఉందని రాజకీయ పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.

**పార్టీ బలం తగ్గితే కష్టమే!**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన నాటి నుంచి శేరిలింగంపల్లి నియోజకవర్గం తొలినాళ్ల నుండి పార్టీకి బలమైన కోటగా మారింది. గులాబీ జెండాకు ఇక్కడి ఐటీ ఉద్యోగులు, స్థానిక ప్రజలు నిలకడగా మద్దతు ఇస్తూ వచ్చారు. గత రెండు పర్యాయాలుగా గులాబీ దళం ఇక్కడ తిరుగులేని విజయాన్ని నమోదు చేస్తూ తన ఆధిపత్యాన్ని నిలుపుకుంది. అయితే, ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, మరోవైపు నియోజకవర్గంలో బీఆర్ఎస్ కీలక నేతల మధ్య సఖ్యత లేకపోవడం పార్టీ భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తోంది. శేరిలింగంపల్లి డివిజన్లో క్షేత్రస్థాయిలో ఎంతో బలంగా ఉన్న పార్టీని కాపాడుకోవాలంటే అధిష్టానం తక్షణమే స్పందించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా పొట్ట నరేంద్ర యాదవ్, మారబోయిన రవికుమార్ యాదవ్ల మధ్య ఉన్న విభేదాలకు చెక్ పెట్టి, పార్టీ వర్గాలను ఏకం చేయకపోతే వచ్చే ఎన్నికల్లో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని శ్రేయోభిలాషులు, కార్యకర్తలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




తమ డిమాండ్లపై రూపొందించిన పోస్టర్ ను విడుదల చేస్తున్న విద్యుత్ ఉద్యోగ సంఘం నాయకులు

## విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి పాలక వర్గాలు చిత్తశుద్ధితో కృషి చేయాలి

### ఈనెల 19న తలపెట్టిన మహాధర్నా పోస్టర్ ను విడుదల చేస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు, ఉద్యోగులు

**మెహదీపట్నం, ఆగస్టు17(ప్రభాత ఉదయం)**

విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి పాలక వర్గాలు చితశుద్ధితో కృషి చేయాలని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ స్పష్టం చేసింది. విద్యుత్ ఉద్యోగులను విస్మరిస్తే పాలక వర్గాలకు ప్రతిఘటన తప్పదని జేఏసీ పేర్కొంది. జేఏసీ పిలుపులో భాగంగా పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలి ,రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ పరిధి విభాగాలను ప్రైవేటీకరించే ప్రతిపాదనను నిరసిస్తూ మొత్తం 14 డిమాండ్స్ తో కొనసాగుతున్న ఆందోళనకు అనుగుణంగా ఈనెల 19 వ తేదీన ( బుధవారం ) మహాదర్నాను విద్యుత్ సౌధ, ఖైరతాబాద్ వద్ద చేపట్టడం జరుగుతున్నదని సంఘం నాయకులు తెలిపారు. ఈ మహాధర్నాకి సంబంధించి సోమవారం 14 డిమాండ్స్ తో సైబర్సిటీ సర్కిల్ ఆఫీస్ ఆవరణలో పోస్టర్ రిలీజ్ చేయడం జరిగింది. మహాధర్నాకి విద్యుత్ ఉద్యోగులందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని జాక్ నాయకులు విజయవంతం చేయాలని కోరారు..విద్యుత్ రంగంలో ప్రైవేటీకరణ వల్ల ప్రజలపై ఆదనపు ఆర్థిక భారం పడడమే కాకుండ, ప్రభుత్వరంగ విద్యుత్ సంస్థ సామర్థ్యం, భద్రత, ప్రజాప్రయోజనాలు, ప్రమాదకరంగా ఉంటాయని తెలియజేశారు.ప్రభుత్వరంగ విద్యుత్ సంస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్నది.ఈ నెల19 వ తేదీన జేఏసీ తలపెట్టిన ఛలో విద్యుత్ సౌధ మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీజ్ జేఏసీ తరపున విజ్ఞప్తి చేశారు.విద్యుత్ ఉద్యోగులు పెద్ద ఎత్తున కదిలి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో సైబర్సిటీ రిజినల్ నాయకులు చైర్మన్ భాస్కర్ రెడ్డి,కన్వీనర్ సైదులు,కో కన్వీనర్స్ సందీప్ రెడ్డి, వేణుగోపాల్,లక్ష్మీనారాయణ గౌడ్ , ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫోటో ముద్రించాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు17(ప్రభాత ఉదయం)**

తెలంగాణలో నూతనంగా జారీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫోటో ముద్రించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్ ముందు బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో రేషన్ కార్డు లబ్ధిదారులకు అందే ప్రతి ఆరు కిలోల రేషన్ బియ్యంలో ఐదు కిలోల బియ్యాన్ని కేంద్ర ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేస్తోందని స్పష్టం చేశారు. అలాంటప్పుడు కార్డుపై ప్రధాని నరేంద్ర మోదీ ఫోటోను తొలగించడం కేంద్రాన్ని అవమానించడమేనని ఆరోపించారు. ప్రధాని ఫోటో లేకుండా కార్డుల పంపిణీని తక్షణమే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్ర రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకట రాములు,జిల్లా ప్రధాన కార్యదర్శి లు రవి కుమార్ ఎక్బోటే, శ్యామ్ రావ్,జిల్లా ఉపాధ్యక్షుడు బలిగేరా నల్లారెడ్డి, దామ నాగరాజుబాలేశ్వర్ రెడ్డి, జిల్లా బిజెవైఎం అధ్యక్షుడు బాబుల్ రెడ్డి,జిల్లా మహిళ మోర్చా అధ్యక్షురాలు సమత మధుగౌడ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు దరూర్ కిష్టన్న,పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ నరసింహ, కౌన్సిలర్లు కుమ్మరి శ్రీనివాసులు ,శాలన్న,చంద్ర శేఖర్, బిజెపి సీనియర్ నాయకులు నర్సన్ దొడ్డి క్రిష్ణ రెడ్డి, హానిమి రెడ్డి,మళ్ళెం దొడ్డి వెంకటేస్వర రెడ్డి, పాల్వాయి రాముడు,హన్మంత రాయ,అనిల్ ,శ్రీమన్నారాయణ,మండల అధ్యక్షుడుశ్రీనివాసులు,మరియు పట్టణ వార్డు ఇంచార్జ్ లు , బిజెపి సీనియర్ నాయకులు,బిజెవైఎం నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు..





గంగిడి నీరజ, సాయి రెడ్డి హర్షిని, రిత్విక్ రెడ్డి

## చిన్న అనంతగిరి శివాలయంలో భక్తిశ్రద్ధలతో నాగ పంచమి వేడుకలు

**రాజేంద్రనగర్,ఆగస్టు17(ప్రభాత ఉదయం)**



రాజేంద్రనగర్ నియోజకవర్గంలో నాగ పంచమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు.చిన్న,పెద్ద తేడా లేకుండా కుటుంబ సమేతంగా పాము పుట్టల వద్దకు వెళ్లి నాగ దేవతకు సాంప్రదాయ పూజలు చేశారు.పుట్టల్లో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు.నవ ధాన్యాల పేలాలు నైవేద్యంగా సమర్పించారు.ప్రతి ఒక్కరు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని నాగదేవతను వేడుకున్నట్లు భక్తులు తెలిపారు.అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని చిన్న అనంతగిరి శివాలయంలో నాగ చవితి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు.శ్రావణ సోమవారం నాగుల చవితి రెండు ఒకేసారి రావడం ప్రత్యేకంగా శివ భక్తులకు భక్తిశ్రద్ధలతో పుట్టలో పాలు పోసి,శివాలయంలో శివునికి అభిషేకం చేసి దర్శించుకున్నారు.వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.



## ప్రజావాణి ఆర్జీలను పరిష్కరించాలి

### ప్రజావాణికి 41 ఫిర్యాదులు

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.**

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు17(ప్రభాత ఉదయం)**

ప్రజావాణి ఆర్జీలను పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.సోమవారం ప్రజావాణి సందర్భంగా ఐడిఓసి సమావేశపు మందిరంలో అదనపు కలెక్టరు మధుమోహన్ తో కలిసి ప్రజల నుంచి కలెక్టర్ ఆర్జీలను స్వీకరించారు. ప్రజల నుంచి మొత్తం 41 ఫిర్యాదులు అందాయన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు వివిధ శాఖలకు సంబంధించి సీఎం ప్రజావాణికి మొత్తం ఇప్పటి వరకు జిల్లా నుంచి 244 దరఖాస్తులను ఇవ్వగా ఇంకా 57 ఆర్జీలను పరిష్కరించాల్సి ఉదన్నారు. మండల స్థాయిలోనూ ప్రజావాణి కార్యక్రమంను నిర్వహిస్తున్నందున సంబంధిత శాఖల మండల స్థాయి అధికారులందరూ తప్పకుండా హాజరై తమ శాఖల పరిధిలో వచ్చిన ఆర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు సకాలంలో హాజరుకావాలని, అలసత్వం చూపే వారిపై తగు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# తులం బంగారం దేవుడెరుగు..!? కనీసం పేదింటి "కళ్యాణమైన" జరిపించండి

## పాత బస్టాండ్ నుంచి గద్వాల ఆర్డిఓ కార్యాలయం వరకు పాదయాత్ర

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 17 (ప్రభాత ఉదయం)**








కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందని బీఅర్ఎస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జీ బాసు హన్మంతు నాయుడు విమర్శించారు. బీఅర్ఎస్ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు సోమవారం గద్వాల జిల్లా కేంద్రంలో పాత బస్టాండ్ లో బీఅర్ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున దర్నా చేపట్టారు. అనంతరం పాతబస్టాండ్ నుంచి గద్వాల ఆర్డీవో కార్యాలయం వరకు పాదయాత్రగా వెళ్లి అక్కడ ప్రభుత్వ తీరుకు నిరసనగా ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డిఓ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సంధర్భంగా బాసు హన్మంతు నాయుడు మాట్లాడుతూ.. "నూరు అబద్దాలైన ఆడి ఒక పెళ్లి చేయాలని" ఆనాడు పెద్దలు నానుడి అంటూ ఉండేవారని పేద ఇంటి పిల్లలకు పెళ్లి చేయడానికి కన్న తల్లిదండ్రులు పడుతున్న తాపత్రయం ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని 2014లో ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ 51 వేల రూపాయల పారితోషకంతో కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లాంటి బృహత్తరమైన పథకాలను ప్రవేశపెట్టారని, అలాగే పేదల అవసరాలకు అనుగుణంగా వారి ఇబ్బందులు గుర్తించి వాటిని లక్ష రూపాయలకు పైగా కేటాయించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని ఎన్నో ప్రగల్బాలు పలికారని రెండున్నర సంవత్సరాలు ప్రభుత్వం వచ్చి పాలన కొనసాగుతున్న తులం బంగారం ఇవ్వకపోగా కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లాంటి బృహత్తర పథకాలను ఎత్తివేసేందుకు కుట్ర పన్నుతుందని ఆయన ఆరోపించారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిషేధించే కుట్రను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే మానుకోవాలన్నారు.ఆ పథకాలను నిషేధిస్తే పేదింటి ఆడబిడ్డలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నాదని, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనియెడల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ఆడబిడ్డలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్య క్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బివిఎస్ కేశవ్, మాజీ జెడ్పీటిసి బాసు శ్యామల, నాయకులు రాఘవేంద్రరెడ్డి, ప్రతాప్, కోటేష్, గంజిపేట రాజు, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కేటిదొడ్డి ప్రజావాణిలో 3, ధరూర్‌లో 4 ఫిర్యాదుల స్వీకరణ








**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు17(ప్రభాత ఉదయం)**

కేటిదొడ్డి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగిన ఈ కార్యక్రమం ఎంపీడీవో రమణరావు పర్యవేక్షణలో కొనసాగింది. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తహసీల్దార్ కరుణాకర్ ఎస్ఐ పి.శ్రీనివాసులు, ఎంపీఓ రామన్ గౌడ్, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజల నుండి మూడు ఫిర్యాదులు అందాయని ఎంపిఓ రమణారావు తెలిపారు. ధరూర్ ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓ కృష్ణమోహన్ పర్యవేక్షణలో నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 4ఫిర్యాదులు అందాయని ఎంపిడిఓ కృష్ణమోహన్ తెలిపారు.ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత శాఖలకు పంపినట్లు అధికారులు తెలిపారు.

# ఘనంగా నాగ పంచమి వేడుకలు

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు17(ప్రభాత ఉదయం)**



నాగ పంచమిని పురస్కరించుకొని పలుదేవాలయాల వద్ద భక్తు ల రద్దీ అధికంగా కనిపించింది. పంచమి రోజు శివునికి రుద్రాభిషేకం నిర్వహిం చడంతో పాటు నాగదోషం ఉన్న వారు నాగులకు పాలు పోయడం, రాహువు దోషం ఉన్న వారు నాగులను పూజిస్తే దోషం నివారణ అవుతుందని భక్తుల నమ్మకం. ముఖ్యంగా నాగుల చవితి, పంచమి రోజు నాగులకు అభిషేకం చేసి అలంకరించి పాలు పోసి నైవేద్యం సమర్పించడం ఆనవాయితీ. పంచమిని పురస్కరించుకొని సోమవారం గద్వాలలోని పలుదేవాలయాల వద్ద అశ్వర్థకట్ట, నాగదేవతల కట్టలకు భక్తులు పూజలు నిర్వహించారు. పుట్టలో పాలు పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ఇంటికి వచ్చే సోదరుల ఆరోగ్యం, ఐశర్యం, వృద్ధి కావాలని కోరుతూ భక్తితో పూజలు నిర్వహించారు.

అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న అంజయ్య నగర్ డివిజన్



నాయకులు ఆంజనేయులు సాగర్ తో పాటు బస్తీ వాసులు..

# బస్తీ వాసుల ప్రాణాలతో చెలగాటం వద్దు.. తక్షణమే దోమలను నివారించండి!

**అంజయ్య నగర్, సిద్ధిక్ నగర్, పీజేఆర్ నగర్, గుల్షన్ నగర్‌లలో రోజురోజుకూ పెరుగుతున్న దోమల బెడద**

**డెంగ్యూ, మలేరియా బారిన పడి విలవిలలాడుతున్న ప్రజలు**

**'ప్రజావాణి'లో అదనపు కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌లకు వినతిపత్రం సమర్పించిన ఆంజనేయులు సాగర్**

**వెంటనే చర్యలు తీసుకుంటామని అధికారుల హామీ**

**శేరిలింగంపల్లి : ఆగస్టు 17,(ప్రభాత ఉదయం)**

అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని పలు బస్తీలలో వర్షాకాలం నేపథ్యంలో మురుగునీరు నిలిచిపోయి, దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయని.. అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజలు తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని డివిజన్ నాయకులు ఆంజనేయులు సాగర్ ఆవేదన వ్యక్తం చేశారు. దోమల నివారణకు ఎంటమాలజీ విభాగ అధికారులు తక్షణమే రంగంలోకి దిగి నివారణ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో భాగంగా అంజనేయులు సాగర్ ఆధ్వర్యంలో బస్తీ వాసుల సమస్యలపై జిహెచ్ఎంసి అదనపు కమిషనర్, డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణలను కలిసి వినతిపత్రం అందజేశారు.

**స్తంభించిన డ్రైనేజీ పైపులైన్లు విలవిలలాడుతున్న బస్తీలు**

ఈ సందర్భంగా ఆంజనేయులు సాగర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అంజయ్య నగర్, సిద్ధిక్ నగర్, పీజేఆర్ నగర్, గుల్షన్ నగర్ తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు, డ్రైనేజీ నీరు రోడ్లపైనే నిలిచిపోవడంతో దోమలకు నిలయాలుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. సరైన పారిశుధ్య నిర్వహణ లేకపోవడంతో చిన్నపిల్లలు, వృద్ధులు డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారని తెలిపారు. పారిశుధ్య సిబ్బంది క్రమం తప్పకుండా చెత్తను తొలగించకపోవడం, ఎంటమాలజీ విభాగం ఫాగింగ్ చేపట్టకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని మండిపడ్డారు.

**అధికారుల హామీ చర్యలకు ఆదేశాలు**

విభాగాల అధికారుల అలసత్వం వల్ల ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని ఆంజనేయులు సాగర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన అదనపు కమిషనర్ డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణ వెంటనే ఎంటమాలజీ అధికారులను సమన్వయం చేసి, సమస్య తీవ్రత ఉన్న బస్తీలలో అత్యవసరంగా యాంటీ లార్వా స్ప్రేయింగ్, ఫాగింగ్ కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టమైన హామీ

# ప్రజావాణికి(136)ఫిర్యాదులు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి,ఆగస్టు17(ప్రభాత ఉదయం)**



జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజల నుండి సమస్యలు వింటున్న అధికారులు


సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (136) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను జిల్లా రెవెన్యూ అధికారి శారద దేవి కి విన్న విస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ శారద దేవి మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ--60, ఇతర శాఖలు -76, మొత్తం దరఖస్తులు అందాయి.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఉడిపి, పాలిమర్ మఠం పీఠాధిపతులచే జంట నాగులకు ప్రత్యేక అభిషేక పూజలు

**పెద్ద చింతరేవులలో భక్తులచే నాగపంచమి పూజలు....**

**ఆలయ ప్రధాన అర్చకులు ఆద్య చక్రవర్తి కేశవాచార్యులు...**

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు17(ప్రభాత ఉదయం)**



జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల పరిధిలోని పెద్ద చింతరేవుల గ్రామంలో 18 వ శతాబ్దం నాటి ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో జంటనాగులకు ఉడిపి పాలిమర్ మఠం పీఠాధిపతులు శ్రావణ సోమవారము నాగ పంచమి సందర్భంగా ప్రత్యేకంగా అభిషేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఆద్య చక్రవర్తి కేశవాచార్యులు తెలిపారు. నాగ పంచమి రోజు జంట నాగులకు పూజించిన, అభిషేకించిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కృప కటాక్షం వారి కుటుంబం పై ఉంటుందని అన్నారు. పాలిమర్ పీఠాధిపతులు శ్రీ 1008 విద్యాదిశ శ్రీపాదుల వారు, శ్రీ1008 విద్యా రాజేశ్వర శ్రీపాదుల వారు శ్రావణ సోమవారం నాడు మూలవిరాట్ శ్రీ ఆంజనేయ స్వామి వారికి సంస్థాన పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో జంట నాగుల స్వామి వారికి ప్రత్యేకంగా పంచామృత, విశేష సుగంధ ద్రవ్యాలతో అభిషేక పూజలు శాస్త్రోక్తంగా చేశారు.జంట నాగుల స్వామివారిని పూజించిన అభిషేకించిన భక్తులకు విశేష విజ్ఞాన కలిగిన సుపుత్ర సంతానం,అష్ట ఐశ్వర్యాలు, జ్ఞానం,కీర్తి ప్రాప్తిస్తుందని అన్నారు. పెద్ద చింతరేవుల అన్న ప్రసాద ట్రస్ట్ వారిచే పాల్గొన్న భక్తులందరికీ అన్న ప్రసాద పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఆద్య వామనచారి, ఆద్య కిష్టాచారి,ఆద్య మద్వాచారి, భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



మహా పరుగు కోసం అధికారులతో సమావేశమైన సీపీ ఇతర అధికారులు..

# రన్ సైబర్... రన్! హైదరాబాదీల మహా పరుగుకు 'సైబరాబాద్' మార్గదర్శి!

**ఆగస్టు 29, 30 తేదీల్లో 'ఎన్ఎండిసి హైదరాబాద్ మారథాన్'.. సరికొత్త అనుభూతికి నగరం సిద్ధం**

**30 వేల మంది రన్నర్లు.. 65 షటిల్ బస్సులు.. పటిష్టమైన ట్రాఫిక్, భద్రతా చర్యలు**

**కమిషనర్ ఎం.రమేష్ నేతృత్వంలో అధికారుల ఉన్నత స్థాయి సమీక్ష**

**శేరిలింగంపల్లి : ఆగస్టు 17, (ప్రభాత ఉదయం)**

భాగ్యనగర క్రీడా రంగానికి తలమానికమైన 'ఎన్ఎండిసి హైదరాబాద్ మారథాన్' కు సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ సర్వం సిద్ధం చేస్తోంది. ఈ నెల 29, 30 తేదీల్లో అత్యంత వైభవంగా జరగనున్న ఈ రన్నింగ్ ఈవెంట్ నిర్వహణ ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై సైబరాబాద్ సీపీ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం.రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ట్రాఫిక్ జాయింట్ సీపీ సున్ ప్రీత్ సింగ్, సీఎమ్‌సీ, టీజీఐఐసీ, హైదరాబాద్ రన్నర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ మారథాన్‌లో దాదాపు 30 వేల మంది రన్నర్లు పాల్గొంటారని అంచనా ప్రధాన ఈవెంట్లు ఆగస్టు 30న ఉదయం 4:30 గంటలకు పీపుల్స్ ప్లాజా వద్ద ప్రారంభమై, కేబుల్ బ్రిడ్జి మీదుగా సైబరాబాద్ పరిధిలోకి ప్రవేశించి ఉదయం 10:00 గంటలకు గచ్చిబౌలి జీఎమ్‌సీ బాలయోగి స్టేడియంలో ముగుస్తాయి.

**రేస్ షెడ్యూల్ విశేషాలు:**

ఆగస్టు 29 శనివారం హెచ్ఐసీసీ వద్ద ఉదయం 6:30 గంటలకు దివ్యాంగుల రేసుతో పాటు 5 కే రన్ ప్రారంభమవుతుంది. సుమారు 6 వేల మంది పాల్గొనే ఈ రన్ బయోడైవర్సిటీ మీదుగా గచ్చిబౌలి వద్ద ముగుస్తుంది.ఆగస్టు 30 ఆదివారంఫుల్ మారథాన్ 42 కే ఉదయం 04:30 గంటలకు పీపుల్స్ ప్లాజాలో ప్రారంభమై నెక్లెస్ రోడ్, రాజ్ భవన్ రోడ్, జూబ్లీ చెక్ పోస్ట్, రోడ్ నెం 45, షేక్‌పేట్, నార్సింగి, ఓఆర్ఆర్ జంక్షన్, బయోడైవర్సిటీ మీదుగా గచ్చిబౌలి స్టేడియం చేరుకుంటుంది.హాఫ్ మారథాన్ 21కే నెక్లెస్ రోడ్, స్టేడియం లూప్‌లు మినహాయించి ఫుల్ మారథాన్ మార్గంలోనే సాగి గచ్చిబౌలిలో ముగుస్తుంది.10 కే రన్ ఉదయం 07:30 గంటలకు హైటెక్ సిటీలో ప్రారంభమై లేమన్ ట్రీ జంక్షన్, బయోడైవర్సిటీ మీదుగా గచ్చిబౌలి స్టేడియం చేరుకుంటుంది.లిఅడ్డంకులు లేకుండా పరుగు ప్రత్యేక నిబంధనలు

**'సెల్ఫీ' వేళ కేర్‌ఫుల్**

ఫ్లైఓవర్లు, వ్యూ పాయింట్ల వద్ద సెల్ఫీల కోసం ఆగిపోతే తోటి రన్నర్లకు ఇబ్బంది కలుగుతుంది. మార్గమధ్యంలో క్రమశిక్షణ పాటించేలా మార్షల్స్ పర్యవేక్షిస్తారు.

రన్నర్ల కోసం 65 షటిల్ బస్సులను ఏర్పాటు చేశారు. రన్నర్లను దించేందుకు 'బోర్డర్స్ పార్కింగ్' జోన్లను నిర్దేశించారు. రేస్ జరిగే మార్గాల్లో ఓలా, ఉబర్, రాపిడో, జొమాటో, స్విగ్గీ వంటి యాప్ ఆధారిత వాహనాల రాకపోకలను గచ్చిబౌలి స్టేడియం ముగింపు పాయింట్ వరకు పూర్తిగా నిరోధించారు.

రోడ్ల పునరుద్ధరణ: పరుగుకు ఇబ్బంది కలగకుండా రోడ్లపై గుంతలను పూడ్చడం, రన్నర్లు పడిపోకుండా తాగునీటి పాకెట్లు, ఎనర్జీ జెల్ కవర్లను ఎప్పటికప్పుడు తొలగించేందుకు పారిశుధ్య చర్యలు చేపడుతున్నారు. రన్నర్లు దాటిపోయిన మార్గాల్లో భద్రతా వాహనాల పర్యవేక్షణ అనంతరం రోడ్లను వెంటవెంటే సాధారణ ట్రాఫిక్ కోసం పునరుద్ధరిస్తారు. ఈ మొత్తం ఈవెంట్‌ను 'సైబరాబాద్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్' ద్వారా ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ, అత్యవసర సమయాల్లో తక్షణ చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు.



పిఎసి సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కొండకళ్ల నాగేందర్ రెడ్డి,


# జిల్లాలో వాటిని మరింత బలోపేతం చేయాలి:

**తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్**

**ప్రభుత్వ పథకాలు ప్రజల కు చేర్చాలి**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు17(ప్రభాత ఉదయం)**

రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల ముందుకు చేర్చాలని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ సూచించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా పి ఏ సి సమావేశంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జ్, మీనాక్షి నటరాజన్ , సి డబ్ల్యూ సి ప్రత్యేక ఆహ్వానితులు, మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ చల్లా వంశీచంద్ రెడ్డి , క్రమశిక్షణ కమిటీ చైర్మన్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లాకు చెందిన అగ్రనేతలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, వివిధ విభాగాల రాష్ట్ర , జిల్లా నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేఎల్ఆర్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి , షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ , చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ భీమ్ భరత్ , శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ జగదీష్ గౌడ్ , రాజీవ్ గాంధీ సంఘటన రాష్ట్ర చైర్మన్ సిద్దేశ్వర , సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ మిద్దెల జితేందర్ , రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొండకళ్ళ నాగేందర్ రెడ్డి , సేవాదళ్ అధ్యక్షులు రమాకాంత్ , ఎస్టీ సెల్ చైర్మన్ శ్రీను నాయక్ ,ఎస్సీ సెల్ చైర్మన్ శ్రీధర్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర , జిల్లా స్థాయి నాయకులు పాల్గొన్నారు.సమావేశంలో ఎస్ ఐ ఆర్ తో పాటు రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన పలు ముఖ్యమైన రాజకీయ, ప్రజా సమస్యలు , పార్టీ కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించారు.రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం సమన్వయంతో ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు.



# ప్రజావానికి విశేష స్పందన

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు17(ప్రభాత ఉదయం)**

జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ తాలూకా ఐయ్య మండల కేంద్రంలో ఎంపీడీవో మహేష్ అధ్యక్షతన జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల నుండి ప్రజావాణికి24 దరఖాస్తులు. అయిజ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని మండల స్థాయికి విస్తరించి ఎంపిడిఓ కార్యాలయంలో సోమవారం కార్యక్రమం నిర్వహించారు. మొత్తం24 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో రెవెన్యూ శాఖకు 12, ఎంపిడిఓ/ఎంపిఓ శాఖకు4, ఏఈ హౌసింగ్‌కు 1, ఏఈ ఎలక్ట్రిసిటీకి3, మున్సిపాలిటీకి 3, ఆరోగ్య శాఖకు 1 దరఖాస్తు అందింది. వాటిని సంబంధిత శాఖలకు పంపించి త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపిడిఓ మహేశ్ తెలిపారు.




# గ్రామానికి ఆర్టీసీ బస్సు రాలేదంటూ గ్రామస్తులు నిరసన

**రాత్రి వేళలో కాలినడకన వెళ్లిన గర్భిణి**

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు17(ప్రభాత ఉదయం)**

గత కొంత కాలంగా తమ గ్రామానికి ఆర్టీసీ బస్సు రావడం లేదని గట్టు మండలం పెంచికలపాడు గ్రామస్థులు ఆందోళనకు దిగ్గారు. సోమవారం ఉదయం పెంచికలపాడు గ్రామంలోకి ఆర్టీసి బస్సు రావడంతో గ్రామస్తులు బస్సును అడ్డగించి ధర్నాకు దిగ్గారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ... గద్వాల నుంచి గట్టుకు వయా పెంచికలపాడు, ఆరగిద్ద గ్రామాలకు వెళ్లే ఆర్టీసి బస్సు గత కొంతకాలంగా పెంచికలపాడు గ్రామంలోకి రావడం లేదని ఆరోపించారు. పెంచికలపాడు గ్రామానికి చెందిన సరిత (రెండునెలల గర్భిణి) తన భర్త, 11నెలల చిన్నారితో కలిసి హైదరాబాద్ నుంచి గద్వాలకు రాగ, ఆదివారం రాత్రి 9.15 గంటలకు పెంచికలపాడు వెళ్లేందుకు గద్వాలలో బస్సు ఎక్కింది. రాత్రి 10.45 గంటలకు ఆర్టీసి సిబ్బంది బస్సును పెంచికలపాడు గ్రామంలోకి తీసుకెళ్లకుండా వారిని స్టేజ్ మీద దింపేసి వెళ్లారని, రాత్రి వేళ్లలో 1.5 కి.మీ నడుచుకుంటూ వెళ్లాల్సి వచ్చిందని వారు ఆవేధన వ్యక్తం చేశారు. గత కొన్నిరోజుల నుంచి ఆర్టీసి బస్సు లోపలికి రాకుండా ప్రయాణికులను ప్రధాన రహదారిపై ఉన్న స్టేజీ సమీపంలోనే వదిలి వెళ్తుండటంతో వృద్ధులు, మహిళలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. గ్రామస్థుల సమస్యపై సర్పంచ్ ఆంజనేయులు ఆర్టీసీ డిపో మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడి, ఆర్టీసి బస్సులను యథావిధిగా గ్రామం లోపలికి నడిపించాలని డిపో మేనేజర్‌ను కోరారు. దీనిపై స్పందించిన డీఎం, సమస్యను త్వరలోనే పరిష్కరించి, బస్సులను సక్రమంగా గ్రామానికి పంపిస్తామని హామీ ఇచ్చారు. సర్పంచ్ ఆర్టీసీ అధికారుల నుంచి స్పష్టమైన హామీ రావడంతో గ్రామస్థులు తమ నిరసనను విరమించారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608